## కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


అధికారులతో మాట్లాడుతున్న పద్మానాయక్

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి నందనవనంకాలనీ, ఆదర్శ్‌నగర్‌కాలనీ వెనుకవైపు ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్ అన్నారు. సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన ప్రభుత్వ భూమి ఖాళీగా ఉండడంతో కొంత మంది కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆదివారం సరూర్‌నగర్ మండల తహసీల్దార్, ఎక్సైజ్ సీఐ సదరు భూమిని పరిశీలించి సూచిక బోర్డు ఏర్పాటు చేశారు.

## పోచమ్మదేవికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

మన్సూరాబాద్: ఆషాఢమాస బోనాల ఉత్సవాల్లో భాగంగా మన్సూరాబాద్‌లోని ప్రసిద్ధిగాంచిన స్వయంభు పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలలో శాకంబరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 26న నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి దేవాలయం కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో దేవాలయం నుంచి పోచమ్మ దేవికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారని కొప్పుల విఠల్‌రెడ్డి తెలిపారు. పూజల్లో ఆలయ కమిటీ వైస్ చైర్మన్లు పోచబోయిన గణేష్‌యాదవ్, నాంపల్లి శంకరయ్య, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, నాంపల్లి కృష్ణ, అర్చకులు శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.

## కాశీక్షేత్రంలో చాతుర్మాస దీక్ష ప్రారంభం


అనుగ్రభాషణ చేస్తున్న సిద్ధేశ్వరానంద భారతి స్వామి

దిల్‌సుఖ్‌నగర్: కాశీక్షేత్రంలో కుర్తాళ సిద్ధేశ్వరి పీఠాధిపతులు జగద్గురువులు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి వారి చాతుర్మాస దీక్ష ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయని కుర్తాళ పీఠ నిర్వాహకులు తెలిపారు. కుర్తాళ పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో వేదవ్యాస మహర్షి పూజ, సిద్ధ గురువు పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి మాట్లాడుతూ.. కాలభైరవుడి అనుగ్రహం లేనిదే ఎవరూ కాశీకి రాలేరని అన్నారు. భక్తులందరూ కాశీక్షేత్రంలో ధ్యానం, తపస్సు, దీక్షలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రమ్యానంద భారతి స్వామి, మోచేర్ల శశిభూషణ్, అద్వైతానంద స్వామి, లలితానంద భారతి స్వామి, వాసుదేవానంద భారతి స్వామి, ఆదిత్యానంద భారతి స్వామి, శ్రీ పర శివానంద భారతి స్వామి, నారాయణానంద భారతి, చిట్టిబాబు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



వనస్థలిపురం: సామాజిక బాధ్యతగా లయన్స్ క్లబ్‌లు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివని, పేద ప్రజల కోసం క్లబ్ సేవలను విస్తరింపజేయాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్. మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురంలో వాసవి దేవాలయం కాన్ఫరెన్స్‌హాల్లో జరిగిన లయన్స్ క్లబ్ ఆఫ్ వనస్థలిపురం క్లబ్ ఏర్పాటు, ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వనస్థలిపురం క్లబ్ నూతన కమిటీ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గంపా నాగేశ్వర్‌రావు, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విశ్వేశ్వరరావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ శ్యామ్‌రావు, వనస్థలిపురం క్లబ్ అధ్యక్షుడు విట్టా దూరయ్య, కార్యదర్శి కిషోర్, కోశాధికారి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## వరదనీరు సాఫీగా పారేలా చర్యలు చేపట్టాలి

మన్సూరాబాద్: గత రెండ్రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారి చింతలకుంట, మధురానగర్‌కాలనీ, గణేష్‌నగర్‌కాలనీ, ఇందిరానగర్ కాలనీల్లోని రోడ్లపై వర్షంనీరు చేరిందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ పరిశీలించారు. కాలనీలలోని రోడ్లపై చేరే వరదనీటిని ప్రధాన ట్రంక్‌లైన్‌ను మళ్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. వరద సమస్యలపై అత్యవసర పరిస్థితులో 100 లేదా మన్సూరాబాద్ డివిజన్ ఎమర్జెన్సీ టీమ్ 70131 37854 నెంబర్లకు సమాచారం అందిస్తే సంబంధిత సిబ్బంది సమస్యను పరిష్కరిస్తారని ఆయన సూచించారు.


వరదనీరు పారేలా చర్యలు చేపట్టిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి

# సాయి దర్శనం పోటెత్తిన భక్తజనం

## వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా




బాబాకు అభిషేకం చేస్తున్న దృశ్యం


పూజల్లో పాల్గొన్న తీగల కృష్ణారెడ్డి

ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ బృందం: గురుపౌర్ణమి సందర్భంగా ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని షిరిడీ సాయిబాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఆదివారం సుమారు 60 వేల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ చైర్మన్ శ్యామ్‌కుమార్ తెలిపారు. వృద్ధులు, గర్భిణులు దివ్యాంగులు, వీఐపీలు, దాతలకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా బాబా దర్శనం కల్పించామన్నారు.

- ఆర్‌కేపురం డివిజన్ పరిధి అల్కాపురి కాలనీలోని సాయిబాబా దేవాలయంలో దేపసురేఖ భాస్కర్‌రెడ్డి సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఎల్‌బీనగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలోని సాయిబాబా దేవాలయంలో ప్రధాన అర్చకులు పండరి శివశంకర్ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- రెడ్డికాలనీలోని సాయిబాబా ఆలయాన్ని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి సందర్శించి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- మన్సూరాబాద్ శ్రీరామ్‌నగర్‌కాలనీలోని షిరిడీ సాయిబాబా దేవాలయం భక్తుల రద్దీతో సందడిగా మారింది. ఆలయ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


సాయినాథుడిని దర్శించుకున్న నాయకులు


పూజలు చేస్తున్న బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు



## నకిలీ లెటర్ ఇచ్చి.. రూ.19 లక్షలు కాజేసి

- ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం
- విద్యుత్ శాఖ ఉద్యోగిపై కేసు

నాగోలు: విద్యుత్‌శాఖలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చి మోసం చేసిన విద్యుత్ శాఖ జూనియర్ అసిస్టెంట్‌పై కేసు నమోదైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోలు మమతానగర్‌కు చెందిన శ్రావణి ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న సమయంలో ఆమె కుటుంబ స్నేహితుల ద్వారా భువనగిరిలోని విద్యుత్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ఘట్‌కేసర్‌కు చెందిన బండారపు కిరణ్‌కుమార్ 2021లో పరిచయమయ్యాడు. ఘట్‌కేసర్‌లో విద్యుత్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసపూరిత మాటలు చెప్పి విడతల వారీగా రూ. 19.50 లక్షలు తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో ఇటీవల పెద్దల సమక్షంలో కిరణ్‌కుమార్‌ను నిలదీశారు. కొన్ని రోజుల తర్వాత టీఎస్ఎస్‌పీడీసీఎల్ జాయినింగ్ ఆర్డర్ లెటర్ వచ్చిందని ఓ నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చాడు. అయితే.. శ్రావణి ఆ లెటర్ తీసుకెళ్లి విచారించగా అది నకిలీదని తేలింది. దీంతో శ్రావణి తన డబ్బులు చెల్లించాలని కిరణ్‌కుమార్‌ను కోరగా ఆరు నెలల్లో ఇస్తానని ఒప్పుకున్నాడు. ఆరు నెలలైనా డబ్బులు ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## శాస్త్రోక్తంగా చండీహోమం



సైదాబాద్: గురు పౌర్ణమి పురస్కరించుకొని సైదాబాద్ మాతామైదాన్‌లో కొలువుదీరిన విజయదుర్గా మాతా ఆలయంలో శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంలో ఆలయ కమిటీ ప్రతినిధి సునీల్‌రెడ్డి, సంగీతారెడ్డి పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## దుర్గామాత ఆలయంలో బోనాలు


వేడుకల్లో పాల్గొన్న హమాలీ సంఘం ప్రతినిధులు


ఉత్సవాల్లో పాల్గొన్న నిర్వాహకులు కార్పొరేటర్

చాదర్‌ఘాట్: బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం చైర్మన్, తెలంగాణ అగ్రిట్రేడర్స్ అసోషియేషన్ చైర్మన్ చేగూరి వెంకటరమణ అన్నారు. మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో హమాలీ సంఘం ఆధ్వర్యంలో నవదుర్గామాతా ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, చిన్నారుల కేరింతల నడుమ బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ.. వర్షాకాలంలో జరిగే ఈ ఉత్సవాలతో అమ్మవారు ప్రసన్నురాలై ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతారన్నారు. హైదరాబాద్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో ప్రతీయేటా అమ్మవారి ఉత్సవాలు మార్కెట్లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సత్యలింగం, సురేష్, దానం శేఖర్, కథలయ్య, లక్ష్మణ్‌రాజు, రవీందర్‌కుమార్, కుమార్, రాజు పాల్గొన్నారు.

### కుమ్మరుల తొలిబోనం..

మన్సూరాబాద్: మన్సూరాబాద్ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంఘం భవనం వద్ద కుమ్మరుల తొలిబోనం జాతరను నిర్వహించారు. మన్సూరాబాద్ గ్రామ కుమ్మరుల తొలి బోనాల ఉత్సవ సమితి చైర్మన్ నాంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో మన్సూరాబాద్ సహారా రోడ్డులోని పోచమ్మ దేవికి డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలతో తొలిబోనం సమర్పించారు. ఈ ఉత్సవాలకు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత మామిడి రాంచందర్, నాంపల్లి శంకరయ్య, నాంపల్లి కృష్ణ, ఈశ్వరయ్య, నాంపల్లి మల్లేష్, వెంకటేష్, శంకర్, నాంపల్లి బాల్‌రాజు, గణేష్, మహేష్, గుండాల నర్సింహ, నాంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

### 28న లెనిన్‌నగర్‌లో బోనాల ఉత్సవాలు

మీర్‌పేట: మీర్‌పేట లెనిన్‌నగర్‌లోని కట్టమైసమ్మ, రక్షమైసమ్మ, పోచమ్మ దేవాలయాల చైర్మన్ దిండు రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం కమిటీ సభ్యులు కట్టమైసమ్మ దేవాలయం వద్ద సమావేశమయ్యారు. రాజుగౌడ్ మాట్లాడుతూ.. అమ్మవార్ల బోనాల ఉత్సవాలను ఈ నెల 28వ తేదీన జరిపేందుకు కమిటీ నిర్ణయించిందని తెలిపారు. లెనిన్ నగర్‌తో పాటు పరిసర కాలనీల ప్రజలందరూ అమ్మవార్లకు బోనాలు సమర్పించాలన్నారు.

## విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపించాలి

ఎల్‌బీనగర్: చైతన్యపురిలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనపై విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వంశీ వర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కాయకష్టం చేసి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరుకుంటే కార్పొరేటర్ కళాశాల యజమాన్యాలు వారి కష్టంలో వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేవని ప్రభుత్వ నిర్లక్ష్యమే విద్యార్థులకు శాపంగా మారుతుందన్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అరుణ్‌కుమార్, వినోద్, బన్నీ, ఉపేంధర్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

### గిరిజన సంఘాలు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా

నాగోలు: విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వివిధ గిరిజన సంఘాలు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆదివారం ఆందోళన నిర్వహించారు.


కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రీచైతన్య కళాశాల యజమాన్యం చదువులపై ఒత్తిడితోనే గిరిజన విద్యార్థిని రమావత్ రేణుశ్రీ ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వెంటనే మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మానాయక్, రాంబాబు నాయక్, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, శివనాయక్ (ప్రచండ) పాల్గొన్నారు. 'రేపటి వరకు ఉంటనో..ఉండనో తెలియదు..డాడీ ఐయాం సారీ' అని రేణుశ్రీ ఆత్మహత్యాయత్నం చేసుకునే ముందు సూసైడ్ నోటు రాసిందని పోలీసులు తెలిపారు.

## రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు. టమాట రూ.49, వంకాయ రూ. 23, బెండ రూ. 23, పచ్చిమిర్చి రూ. 50, కాకర రూ. 32,బీర రూ.18, క్యాబేజీ రూ . 25, ఫ్రెంచి బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 33, దొండ రూ. 23-28, చిక్కుడు రూ. 65, గోకర రూ. 23, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికమ్ రూ. 50, ఆలు రూ. 38, దోస రూ.13, సొర రూ.9, పొట్ల రూ.13, ఉల్లిగడ్డ రూ. 34, చామగడ్డ రూ. 35.

ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

## మంత్రితో ఎలా శంకుస్థాపన చేయిస్తారు?

### బీజేపీ నాయకుల మండిపాటు

బడంగ్‌పేట్: రూ.38కోట్ల కార్పొరేషన్ నిధులతో అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్‌బాబుతో ఎలా శంకుస్థాపన చేయిస్తారని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌కు స్పెషల్ ఫండ్ లేదా అభివృద్ధికి వెచ్చించే ఎమర్జెన్సీ ఫండ్, ఎమ్మెల్యేల కోటా కింద ప్రత్యేక నిధులు తీసుకువచ్చి మంత్రి చేత శంకుస్థాపన చేయిస్తే అందరూ సంతోషించేవాళ్లమని పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధికి ప్రజలు కట్టిన పన్నులతో సాధారణ నిధులు వెచ్చించి శంకుస్థాపన చేయించడం బాధాకరమని వెంకట్‌రెడ్డి వాపోయారు. ఈ విషయంలో మేయర్ కావాలనే ఇతర పార్టీల కార్పొరేటర్లను అవమాన పరిచేవిధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో మేయర్ బీజేపీ కార్పొరేటర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి సభలో ప్రొటోకాల్ అవసరం లేకుండా ఎన్నికల్లో ఓడిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం ఏంటని నిలదీశారు. రానున్నకాలంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేత ఎంపీ నిధులను బడంగ్‌పేట, మీర్‌పేట్ కార్పొరేషన్లకు మంజూరు చేయించి ఎంపీతో పాటు అందెల శ్రీరాములుయాదవ్‌ను స్టేజీ మీదకు ఆహ్వానిస్తామన్నారు. అప్పుడు కూడా కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ రగడ చేయకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏనుగు రాంరెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జోరల ప్రభాకర్, దొడ్డి శ్రీశైలం కురుమ, మాజీ కౌన్సిలర్ ఈరెంకి వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కులగణన అవగాహన సదస్సును విజయవంతం చేయాలి

నాగోలు: కులగణన అవరోధాలు పరిష్కారాలు అంశంపై ఈ నెల 24న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే బీసీబడి సదస్సును విజయవంతం చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు చామకూర రాజు కోరారు. ఆదివారం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరంచారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఇన్‌చార్జి కేవీ గౌడ్ మాట్లాడుతూ..బిహార్ రాష్ట్ర ప్రభుత్వంరిజర్వేషన్ల పెంపుకోసం కులగణన నిర్వహించి సేకరించిన డాటా ఆధారంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 65 శాతం రిజర్వేషన్లు పెంచారన్నారు. దీనిపై ఓ అగ్రకులానికి చెందిన ఒక వ్యక్తి బిహార్ హైకోర్టు (పాట్నా కోర్టులో) పిల్ వేయగా బిహార్ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన రిజర్వేషన్ల చట్టం అమలు చేయడానికి వీలు లేదని పాట్నా హై కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పుపై పూర్తి విశ్లేషణ ఈ సదస్సులో చర్చిస్తారన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం


భవనాన్ని ప్రారంభిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, నాయికోటి పవన్‌కుమార్

నాగోలు: కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ ఆర్టీసీ కాలనీలో ఆదివారం నిర్వహించిన సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం భవనం, నూతన డ్రైనేజీ లైన్ ప్రారంభోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీ భవన నిర్మాణం, డ్రైనేజీ లైన్ నిర్మాణానికి సహకరించిన కాలనీవాసులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, కాలనీ అధ్యక్షుడు పెంటారెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు యోగేందర్ రెడ్డి, యాదగిరి, శివచారి, కిరణ్ గౌడ్, రమేష్ చారి పాల్గొన్నారు.

## మాదిగ మహాధర్నాను విజయవంతం చేయాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగోలు: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 9న ఢిల్లీలో జరిగే మాదిగ మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ మహిళ అధ్యక్షురాలు ఆకారపు రుక్కమ్మ, జాతీయ ఉపాధ్యక్షులు శనగల యాదగిరి ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంపత్, అధ్యక్షులు పంతం ఉపేందర్ కోరారు. ఆదివారం ఎల్‌బీనగర్‌లో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న నాయకత్వంలో పార్లమెంట్‌లో వర్గీకరణ చేపట్టాలి అనే డిమాండ్‌తో చలో మాదిగ చలో ఢిల్లీ ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్, సుగుణమ్మ, రమణమ్మ, యాదమ్మ, అంజమ్మ, నరసింహ, రవికుమార్, రాజు, ముకుందం, రామస్వామి పాల్గొన్నారు.

## గురువు దైవంతో సమానం

రామంతాపూర్: గురువు దైవంతో సమానమని కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకట్‌రావు అన్నారు. ఆదివారం వెంకట్‌రెడ్డినగర్‌లోని శ్రీ సాయిబాబా మందిరంలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న వారు ఆలయ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, అధ్యక్షుడు మహాదేవభట్ల లక్ష్మణ్ ప్రసాద్ శర్మతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజ్ఞానంలో ఉన్న వారిలో జ్ఞాన జ్యోతిని వెలిగించి సన్మార్గంలో నడిపించే గురువు దైవంతో సమానమన్నారు.